## క్లుప్తంగా

### 108 వాహనంలో మహిళ ప్రసవం



చేబ్రోలు: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని 108 వాహనం ద్వారా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవించిన సంఘటన చేబ్రోలు మండలంలో శుక్రవారం జరిగింది. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన నల్లనూకల శివలక్ష్మి పురిటినొప్పులతో బాధపడుతుండటంతో 108 వాహనం ద్వారా తెల్లవారుజామున తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నారు. మార్గంమధ్యలో అధికం కావడంతో వాహనాన్ని పక్కన నిలిపి వేసి, సిబ్బంది కె. అనిల్‌కుమార్, వి. కిశోర్‌బాబు అత్యవసర వైద్యసేవలు అందించారు. శివలక్ష్మి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు సురక్షితంగా ఉన్నారు. ఇద్దరినీ తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మహిళ కుటుంబసభ్యులు సిబ్బందిని అభినందించారు.

### వేళంగిణి మాత దేవాలయానికి పాదయాత్ర



ప్రత్తిపాడు: ఉపవాస దినాల్లో భాగంగా విశ్వాసులు వేళంగిణి మాత పుణ్యక్షేత్రానికి కాలినడకన తరలివెళ్లారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా గత నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాస దినాల్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలెం, చినకోండ్రుపాడులోని అమలోద్భవి మాత చర్చి విశ్వాసులు విచారణ గురువు ఫాదర్ మేరాబాబు ఆధ్వర్యంలో పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెంలోని వేళంగిణి మాత పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్లారు. క్రీస్తు గేయాల్ని ఆలపిస్తూ, మేరిమాతను స్మరించుకుంటూ సుమారు 250 మంది విశ్వాసులు ప్రత్తిపాడు మీదుగా పుణ్యక్షేత్రానికి తరలారు. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెం నుంచి కూడా ఉపవాస దీక్ష తీసుకున్న విశ్వాసులు శిలువను మోస్తూ, క్రీస్తును స్మరించుకుంటూ వేళంగిణి మాత క్షేత్రానికి వెళ్లారు.

### అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి కృషిచేయాలి



ప్రత్తిపాడు: అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి దళితులంతా కృషిచేయాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయక్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం డీబీఎఫ్ నియోజక వర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వినయ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్నప్పుడే దళితులకు విముక్తి వస్తుందని తెలిపారు. అంబేడ్కర్ భావజాల వ్యాప్తిలో భాగంగా గుంటూరు జిల్లావ్యాప్తంగా ఏడు నియోజక వర్గాల్లో 60 కేంద్రాల్లో ప్రచార కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్ 25న గుంటూరులో దళిత గరిజన సంస్థలు, సంఘాలన్నింటిని ఏకం చేసి దళిత బహుజనుల హక్కుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌వాదులు, అన్ని సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూపతి సునీల్‌కుమార్, డీబీఎఫ్ నాయకుడు కోడిరెక్క కోటిరత్నం, ఐలా మాణిక్యరావు పాల్గొన్నారు.

### సమతులాహారంతోనే ఆరోగ్యం



చేబ్రోలు: విద్యార్థులు సమతులాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా మేనేజర్ టి.కృష్ణవేణి సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శుక్రవారం ''పోషణ్ పక్వాడ'' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మినిస్ట్రీ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వారు ఈ కార్యక్రమాన్ని ''న్యూట్రిషన్ ఫర్ ఆల్ : టుగెదర్ టువర్డ్స్ ఏ హెల్తీ ఇండియా'' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా మేనేజర్ మాట్లాడుతూ హెల్తీ సొసైటీ నిర్మాణమే లక్ష్యమన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, ప్రోటీన్లు, కాల్షియం ఎక్కువగా ఉన్న పదార్థాలనే వినియోగించాలని సూచించారు. రాగులు, జొన్నలు, సజ్జలు, అరికెలు వంటి చిరుధాన్యాలను ప్రతి రోజు ఆహారంలో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ సౌమ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు రాగి జావ తాగితే బలంగా ఉంటారని తెలిపారు. ప్రతిరోజు ఆహారంలో రైస్‌కు బదులు మిల్లెట్స్‌ను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లాయర్ ఏ.విజయలక్ష్మి, ఆయా విభాగాల డీన్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కాకుమానులో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

**ఎమ్మెల్యే మేకతోటి సుచరిత**

కాకుమాను: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత అన్నారు. స్థానిక శ్రీ చెన్నకేశవ దేవస్థాన కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసన సభ్యురాలు సుచరిత మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు గా మహిళలకు ఒక అన్నగా, తమ్మునిగా ఉంటూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏటా డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తున్న ఏకైక నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఆమె కొనియాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మిన ఏకైక నాయకుడు దేశ చరిత్రలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డేనని ఆమె తెలిపారు. మహిళలకు భరోసా కల్పించిన మహా నాయకుడు అన్న జగనన్న అని ఆమె తెలిపారు. మండలంలో మూడో విడతగా 868 డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ. 7.55కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు సుచరిత తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచ్ పసుపులేటి శివపార్వతి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ కె.శరత్ బాబు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సోమశేఖర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఝాన్సీ, డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

**పెదనందిపాడులో..**

మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత తెలిపారు. పెదనందిపాడులో శుక్రవారం జరిగిన వైస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీలో ఆమె మాట్లాడారు. మండలం లో 6,826 మంది మహిళలకు రూ. 5,13,51,000 వారి ఖాతాల్లో జమ అయ్యాయని చెప్పారు. ఈ రోజున మహిళల ఆనందం మాటల్లో చెప్పలేనిదని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హెప్సిబా, వైస్ ఎంపీపీలు ఖాసింబీ, సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్స్ షేక్ ఖాసింపీరా, కొండా కృష్ణారెడ్డి, ఏపీఎం సుబ్బారావు, సర్పంచ్ దాసరి పద్మారావు, ఎంపీటీసీ సభ్యురాలు మాలతి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైస్సార్ క్రాంతి పథం సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

పెదనందిపాడు: గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం శాసనసభ్యురాలు మేకతోటి సుచరిత శంకుస్థాపన చేశారు. కట్రపాడు గ్రామంలో రూ. 68.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.26 లక్షలతో జలజీవన్ పథకం కింద తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 28.50 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. జగనన్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మినేని దుర్గా ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు చెల్లి లక్ష్మి, ఆర్ అండ్ బీ డైరెక్టర్ పిల్లి మేరి, ప్రత్తిపాడు పార్టీ కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశింపీరా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి ఐసీడీఎస్ కృషి



తిమ్మాపురంలో గర్భవతుల ఇళ్లకు వెళ్లి రక్తహీనతపై వివరిస్తున్న సూపర్‌వైజర్ అరుణ

తిమ్మాపురం (ప్రత్తిపాడు): తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే ఐసీడీఎస్ లక్ష్యమని గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. పోషణ పక్షోత్సవాలలో భాగంగా గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని తిమ్మాపురంలో శుక్రవారం సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక ప్రాథమిక పాఠశాలలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తిలకించారు. అనంతరం ఎనీమియాతో బాధపడుతున్న గర్భవతులు, బాలింతల గృహాలతో పాటు బరువు తక్కువ చిన్నారుల గృహాల్ని సందర్శించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఆహారాన్ని గర్భవతులు తీసుకోవడం ద్వారా శిశువులు కూడా ఆరోగ్యంగా జన్మిస్తారని చెప్పారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పోషక విలువలు అధికంగా ఉన్న పౌష్టికాహార కిట్లను అందిస్తుందని, లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు ప్రభుత్వం అందించే బలవర్ధకమైన బాలామృతాన్ని క్రమం తప్పకుండా తల్లిదండ్రులు తినిపించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, సెక్రటరీ సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆకుకూరల్లో అధిక పోషక విలువలు**

పోషణ పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలో గర్భవతులు, బాలింతలు, తల్లులకు పోషకాహారంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు ప్రతి రోజూ ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలోనే స్వచ్ఛమైన కూరగాయలను పండించుకుని వాటిని తినడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని సూపర్‌వైజర్ ఎం.వి. రత్నం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## సీసీ కెమెరా పర్యవేక్షణలో పది పరీక్షల నిర్వహణ



వివిధ పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: మూడో తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి కె.ఎఫ్.కెనడీ తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో పది పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు.పరీక్షలకు విద్యార్థులంతా విద్యాశాఖ సూచించిన సమయంలోపు కేంద్రాలకు హాజరు కావాలని ఆయన సూచించారు. విద్యాశాఖ నిబంధనల్ని ప్రతి విద్యార్థి పాటించే విధంగా హెచ్‌ఎంలు వారిని సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ఇనకుల తిలకుడి రథోత్సవం



పోటెత్తిన భక్తజన సందోహం నడుమ యనమదల సీతారామస్వామి రథోత్సవం

**వేడుకగా శ్రీ రామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం**



శ్రీరామరాజ్య పట్టాభిషేకట్టాన్నినిర్వహిస్తున్న అర్చకులు, ట్రస్టీలు

యనమదల (ప్రత్తిపాడు): నింగీ,నేల మురిసేలా అత్యంత వైభవోపేతంగా జరిగిన అయోధ్యాధీశుని రథోత్సవంతో పల్లె పులకించిపోయింది. వేద పండితుల మంత్రోచ్చరణలు, భక్తజనుల పూజల మధ్య గ్రామస్తులు, భక్తులు చేయిచేయి కలిపి జై శ్రీరామ్.. జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ సీతారాములు కొలువుదీరిన రథాన్ని ముందుకు లాగారు. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని యనమదల శ్రీసీతారామస్వామి దేవాలయంలో దివ్య రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామి వారిని జ్యోతి అలంకారంతో భారీ రథంపై ఊరేగించారు. రెండవ భద్రాద్రిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ సీతారామ స్వామి రథోత్సవ వైభవాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి రావడంతో యనయదల జనసంద్రమైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో పోటెత్తింది. యువత రథం లాగేందుకు పోటీ పడ్డారు. ఉత్సాహంగా ముందుకు లాగారు. మహిళలు రథోత్సవంలో స్వామిని తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఉదయం నృసింహస్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

**జగదానందకరం.. జగదభిరాముని పట్టాభిషేకం**

తొలుత ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం శ్రీ సీతారామస్వామి దేవాలయంలో శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. చలువ పందిరి కింద కల్యాణ మండపంలో శాస్త్రోక్తంగా జరిగిన జగదభిరాముడు, నీలమేఘశ్యాముని పట్టాభిషేక వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు, ట్రస్టీలు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. సాయంత్రం జరిగిన తిరునాళ్లకు, చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు విచ్చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఫార్మసీ రంగంలో ఉజ్వల భవిష్యత్తు



ముఖేష్‌కుమార్ పటేల్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

- భారత ఫార్మసీ మండలి అధ్యక్షుడు డాక్టర్ ముఖేష్‌కుమార్ పటేల్
- ఘనంగా చలపతి ఫార్మసీ కళాశాల 19వ వార్షికోత్సవం

గుంటూరు రూరల్: ఫార్మసీ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భారత ఫార్మసీ మండలి అధ్యక్షుడు డాక్టర్ మోంటు కుమార్ ముఖేష్ కుమార్ పటేల్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాల 19వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పటేల్ మాట్లాడుతూ కోవిడ్ వంటి మహమ్మారి ప్రపంచాన్ని కష్టాల్లోకి తీసుకెళితే ఫార్మాసిస్టులు దాన్ని అంతం చేసేందుకు ఎంతో కృషిచేశారని గుర్తు చేశారు. సరైన సమయంలో సరైన ఔషధాన్ని రోగులకు చేర్చడంతో పాటు ప్రిస్క్రిప్షన్ ఆధారిత సలహాలు, సూచనలు ఇవ్వడం కేవలం ఫార్మాసిస్టులతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఫార్మసీ రంగంలో మన దేశం ఎంతో ఉన్నత స్థానంలో ఉందని తెలిపారు. ఔషధాల తయారీ, పరిశోధన విభాగంలో ఇతర దేశాలకంటే ముందంజలో ఉందని చెప్పారు. పీసీఐ ఈసీ మెంబర్ డాక్టర్ ఎం.వి. రమణ మాట్లాడుతూ ముందు తరాలకు మనం ఏదైనా అందించగలిగామంటే అది ఆరోగ్యకరమైన వ్యవస్థే అని తెలిపారు. ఫార్మసీ విద్య ద్వారా ఎన్నో నూతన అధ్యాయాల్ని సమాజంలో మొదలుపెట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల డెప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ ఎల్.జె. సంధ్యావలి మాట్లాడుతూ భవిష్యత్ యువత చేతిలో ఉందన్నారు. ఒక విజయవంతమైన మనిషి వల్ల ఒక మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అహల్య నర్సింగ్ హోం డాక్టర్ ఎన్. ఉమాశంకర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యావిధానాల ద్వారా విజయాలు సొంతమవుతాయని తెలిపారు. ఐతాన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్. రమణకుమార్ మాట్లాడుతూ ఔషధాల వినియోగం, రోగుల ఆరోగ్యం కాపాడటంలో ఫార్మాసిస్టుల పాత్ర ప్రధానమైందని చెప్పారు. పీసీఐ వీసీ మెంబర్ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలు స్వయం ప్రతిపత్తి మనుగడ సాగించినపుడే ఉత్తమ ఫలితాల్ని సాధించగలుగుతామని, చలపతి ఫార్మసీ కళాశాల ఆకోవకు చెందినదే అని అభినందించారు. అనంతరం కళాశాలలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వై.వి. ఆంజనేయులు, అనంతకుమారి గోల్డ్ మెల్స్, అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరింపజేశాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల ఆశాజ్యోతి వంగవీటి రంగా



రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

**ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య**

పెదకాకాని: పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా ఆశయాల్ని కొనసాగించాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పిలుపునిచ్చారు. పెదకాకాని సెంటర్‌లో నూతనంగా నిర్మించిన వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పెండెం విజయ్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ పేదల పక్షపాతి వంగవీటి మోహనరంగాను కాపు కులానికి చెందిన వ్యక్తిగా కాకుండా బడుగు, బలహీనవర్గాల వ్యక్తిగా చూడాలని తెలిపారు. ఒక మహానాయకుడిగా ఎదుగుతున్న ఆయన్ను చూసి ఓర్వలేక అప్పటి అధికార పార్టీ అంతం చేసిందని పేర్కొన్నారు. రంగా విగ్రహాలు పెట్టకుండా ఆంక్షలు కూడా విధించిందన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న వారికి మరింత లబ్ధి చేకూరేలా చేసిన టీడీపీ నాయకులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని తెలిపారు. అమరావతి పేరుతో భ్రమరావతి సృష్టించి అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేశారని ఆరోపించారు. ముందుగా వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కాలిశెట్టి సహదేవరావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్న సంతర్పణ జరిగింది.

**రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి**

చేబ్రోలు: రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు సైనికులుగా పనిచేసి, వైఎస్సార్ సీపీ విజయానికి, ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా చేయడానికి కృషిచేయాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. పొన్నూరు రూరల్ మండల పరిధిలోని దొప్పలపూడి అడ్డరోడ్డులోని గోవాడ ఫంక్షన్ హాలులో శుక్రవారం మా నమ్మకం... నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, కో కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిలారి మాట్లాడుతూ ఏప్రిల్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు డోర్ టూ డోర్ నిర్వహించటంపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, కర్లపూడి రమేష్, గోళ్ల జ్యోతి, టి. శ్రీనివాసరావు, దాసరి నారాయణ రావు, బొద్దులూరి రంగారావు, సయ్యద్ సుభాని, భవనం వంశీరెడ్డి, పిచ్చిరెడ్డి, పి. కృష్ణ మోహన్, అనిల్ కుమారి, జి. గంగాధర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### 3న వైఎస్సార్ ఆసరా సంబరాలు

గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెంలో గల డబ్బూరి కల్యాణ మండపంలో ఈనెల 3న ఉదయం 10 గంటలకు డాక్టర్ వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాల్ని నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎంపీడీవో శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, లబ్ధిదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

### వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు



గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు శ్రీనివాసకాలనీలోని శ్రీ కోదండరామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అన్నదానాన్ని నల్లపాడు వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో చల్లా పార్థురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### సందడిగా వివా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



సర్టిఫికెట్ల ప్రదానంలో చైర్మన్ విద్యాసాగర్, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ రామచంద్రరాజు

పెదకాకాని: వివా పాఠశాలలో అంతర్జాతీయ స్థాయి ఐబీ(ఇంటర్నేషనల్ బెకలారియేట్) విద్యా ప్రమాణాలతో ప్రీ ప్రైమరి విద్యను ముగించుకుని ప్రైమరీ విద్యకు, ప్రైమరీ విద్యను ముగించుకుని మిడిల్ స్కూలుకు ప్రవేశం పొందుతున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకల్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెనుమత్స రామచంద్రరాజు మాట్లాడుతూ వివా విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరని, అన్ని రంగాల్లో పాల్గొని రాణించాలని సూచించారు. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చదువులో గొప్పగా రాణించాలంటే విద్యార్థులు సంతోషంగా ఉండాలని తెలిపారు. ఉన్నత ప్రమాణాలు, క్రమశిక్షణతో వివా అందించే విద్య వారిని ఇష్టపడి చదువుకునే మార్గంగా నిలుస్తుందని వివరించారు. వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం, సామాజిక నైపుణ్యత అలవరుచుకొనే విధంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దడం ఐబీ ప్రత్యేకత అని తెలిపారు. ఈ సందర్భంగా గ్రేడ్ 1, 6వ తరగతులకు వెళ్లబోతున్న విద్యార్థుల్ని అభినందిస్తూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెనుమత్స రామచంద్రరాజు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వేడుకల్లో భాగంగా చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె.ఎస్. రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం సంధానకర్త కె. మాధవి, సీబీఎస్‌ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అకౌంట్‌లో డబ్బులు వాడుకున్న వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు: బ్యాంకు అకౌంట్‌లో జమ అయిన ఇన్సూరెన్స్ డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ యాకోబ్ షరీఫ్ 2019 నుండి పీపుల్స్‌ట్రామా ఆసుపత్రిలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. అయితే 2019కు ముందు అన్వర్ హుస్సేన్ ఆసుపత్రి నిర్వహించేవాడు. ఈ క్రమంలో అన్వర్ హుస్సేన్ పేరుపైన కొత్తపేటలోని స్టేట్‌బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. అనంతరం కీసర వెంకటేశ్వరరెడ్డి ఆసుపత్రి నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కీసర వెంకటేశ్వరరెడ్డి పేరు మీద నాయుడుపేటలోని స్టేట్‌బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేసి ఆసుపత్రికి సంబంధించి లావాదేవీలు అకౌంట్ ద్వారా నిర్వహిస్తున్నాడు. ఆసుపత్రికి వచ్చిన పలువురు రోగులకు సంబంధించిన గుడ్‌హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ నిర్వాహకులు రూ. 84వేలు కొత్తపేట బ్రాంచ్‌లో ఉన్న అన్వర్ హుస్సేన్ అకౌంట్‌లో జమ అయ్యాయి. అయితే, నగదు వాడుకున్న అన్వర్ హుస్సేన్ నగదు ఇవ్వనని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఆసుపత్రి అకౌంటెంట్ యాకూబ్ షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com